క్లుప్తంగా

నేడు జగన్నాథ రథయాత్ర

ఎంవీపీకాలనీ: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జగన్నాథ స్వామి రథయాత్ర అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. ఎంవీపీ కాలనీ ఐఏఎం వద్ద నుంచి సాయంత్రం 5 గంటలకు సంప్రదాయ రీతిలో ఈ యాత్ర ప్రారంభమవుతుంది. ఎంవీపీ డబుల్ రోడ్డు నుంచి టీటీడీ కూడలి, ఇసుకతోట హైవే జంక్షన్, వెంకోజీపాలెం కూడలి, క్యాన్సర్ హాస్పిటల్, అప్పుఘర్ బీచ్ రోడ్డు మీదుగా రథయాత్ర సాగి.. తిరిగి ఐఏఎంకు చేరుతుంది. యాత్రలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, జగన్నాథ మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రథయాత్రలో నగరంలోని భక్తులు పాల్గొనాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు ఒక ప్రకటనలో కోరారు.

ఘనంగా వారాహి నవరాత్రులు



నూకాంబిక ఆలయంలో హోమం చేస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పాత డెయిరీ ఫారం సమీపం వెటర్నరీ కాలనీలోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో వారాహి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అమ్మవారి ప్రాంగణంలో విష్ణ్వేశ్వర పూజలు, సహస్ర నామ హోమం జరిపారు. మండపారాధన కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయంలో తొమ్మిది రోజుల పాటు ఉదయం, సాయంత్రం సహస్ర నామాలతో హోమం జరుగుతుందని అర్చకులు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

న్యాయ శాస్త్రంలో డాక్టరేట్



ఏయూ వీసీ రాజశేఖర్ నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆదారి కిషోర్

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి ఆదారి కిషోర్ కుమార్‌కు డాక్టరేట్ లభించింది. దామోదరం సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య ప్రకాష్‌రావు మార్గదర్శనంలో 'ఉమెన్ ఎంపవర్మెంట్ త్రూ కానిస్టిట్యూషనల్ అండ్ అదర్ లాస్ ఏ సోషియో లీగల్ స్టడీ ఇన్ స్పెషల్ రిఫరెన్స్ టూ అనకాపల్లి డిస్ట్రిక్ట్' అనే అంశంపై కిషోర్ చేసిన పరిశోధనకు గాను పీహెచ్‌డీ పొందారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో గురువారం కిషోర్‌కుమార్‌కు డాక్టరేట్ ఉత్తర్వులు అందజేసి అభినందించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతా మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వంటకం ప్రత్యేకం



కిచెన్‌లో ఆహార పదార్థాలు కుక్‌చేస్తున్న చెఫ్‌లు

ఏయూక్యాంపస్: శ్రావ్యమైన సంగీతం.. రుచికరమైన ఆహారం.. ఆహ్లాదకరమైన వాతావరణం.. అన్నీ ఒకే చోట కలిసి మనసుకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాయి. బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో జఫ్రాన్ కిచెన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పది రోజుల పాటు జాషాన్-ఇ-జఫ్రాన్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు ఫుడ్ బేవరేజెస్ డైరెక్టర్ ఉదయ్ ప్రకాష్ తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ కిచెన్‌లో తయారు చేసి వడ్డించే ఆహార పదార్థాల మెనూలో ప్రత్యేక మార్పులు చేస్తామన్నారు. ఈ సందర్భంగా జాఫ్రాన్‌లో తయారు చేసిన ప్రత్యేకమైన వంటకాలను అతిథులకు వడ్డించారు. వాటి తయారీ వెనుక ఉన్న కథ, ప్రత్యేకతలు, విశిష్టతలను సైతం వివరించారు. వెజ్, నాన్ వెజ్ రుచులతో మంచి ఆహ్లాదకర వాతావరణంతో సంప్రదాయ నృత్యాలను తిలకిస్తూ జఫ్రాన్ కిచెన్ వార్షికోత్సవాన్ని నగరవాసులు ఆస్వాదించారు. నిపుణులైన చెఫ్‌లు అందించిన రుచికరమైన ఆహారాన్ని రుచి చూస్తూ.. లైవ్ మ్యూజిక్‌ను వింటూ సాయంత్రాన్ని సరదాగా గడిపారు.

మరోసారి బ్రేక్..!



ఎంవీపీ కాలనీలో నత్తనడకన టీటీడీ కూడలి పనులు



కూడలి చుట్టూ కాబుల్ స్టోన్ వర్క్ నిర్మాణం

- ముందుకు సాగని టీటీడీ కూడలి ఆధునికీకరణ
- నేటికీ పూర్తికాని బ్యూటిఫికేషన్, గ్రీనరీ, ఫౌంటెయిన్ పనులు
- పనుల ముగింపులో అధికారుల అలసత్వం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలి ఆధునికీకరణ పనులు మరోసారి నిలిచిపోయాయి. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం(ప్రాజెక్ట్స్) రూ.1.07 కోట్ల వ్యయంతో టీటీడీ కూడలి బ్యూటిఫికేషన్ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. అధికారుల ఆదేశాలతో అయ్యప్ప కన్‌స్ట్రక్షన్స్ సంస్థ గత మార్చి, ఏప్రిల్ నెలల్లో పనులు వేగంగా నిర్వహించి 80 శాతం వరకు పూర్తిచేసింది. ప్రాజెక్టు విభాగం రూపొందించిన ప్లాన్‌కు అనుగుణంగా వేగంగా కూడలిని ఆధునికీకరించారు. నిర్మాణంలో ప్రధాన భాగంగా సర్కిల్ చుట్టూ ప్రత్యేక డిజైన్‌తో కూడిన కాబుల్ స్టోన్ వర్క్, వృత్తాకార గోడల నిర్మాణం, ఇనుప రైలింగ్, శ్రీవారి శంఖుచక్ర నామాల పనులు పూర్తయ్యాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. మరో 20 శాతం నిర్వహించాల్సిన పనులకు 2 నెలలుగా గ్రహణం పట్టింది. 80 శాతం పనులు పూర్తయ్యి దాదాపు 2 నెలలు గడుస్తున్నా.. మిగిలిన పనులు నిర్వహించడంలో అధికార యంత్రాంగం తీవ్ర అలసత్వం వహిస్తోంది. టీటీడీ కూడలి ఆధునికీకరణను నేటికీ పూర్తి చేయకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. స్థానికుల్లో నిరాశ

టీటీడీ కూడలి ఆధునికీకరణలో భాగంగా వాటర్ ఫౌంటెయిన్ మధ్యలో శ్రీవారి శంఖుచక్ర నామాలు ఏర్పాటు చేశారు. దాదాపు 2 నెలలవుతున్నా.. ఇంకా వాటికి వేసిన ముసుగు తొలగించ లేదు. కూడలి ఆధునికీకరణకు సంబంధించి ఫౌంటెయిన్ నిర్మాణం, బ్యూటిఫికేషన్, గ్రీనరీ అభివృద్ధి పనులు ఇంకా చేయాల్సి ఉంది. వీటి కోసం మరింత బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా.. జీవీఎంసీ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే ఆధునికీకరణ పనులు నిలిచిపోయినట్లు తెలిసింది. ఆయా పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడంతోనే శ్రీవారి శంఖు చక్ర నామాలకు ముసుగు వేశారు. దీంతో వీటిని వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్న భక్తులకు నిరాశే మిగిలింది. ఏప్రిల్ చివరి నాటికే కూడలి పనులు పూర్తవుతాయని అధికారులు గతంలో వెల్లడించినప్పటికీ.. అది కార్యరూపం దాల్చకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. నిలిచిపోయిన పనుల కారణంగా టీటీడీ కూడలి కళ కోల్పోయింది. బ్యూటిఫికేషన్ చేయాల్సిన ప్రాంతంలో పచ్చగడ్డి పెద్ద ఎత్తున మొలిచింది. సంబంధిత అధికారులు దృష్టి సారించి టీటీడీ కూడలిని పూర్తి స్థాయిలో ఆధునికీకరించి అందుబాటులోకి తేవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.



2 నెలలుగా శ్రీవారి శంఖుచక్ర నామాలకు తొలగని ముసుగు



బ్యూటిఫికేషన్ చేయాల్సిన ప్రాంతంలో మొలిచిన గడ్డి

ఏఐతో అందరికీ చేరువగా నాణ్యమైన విద్య

మద్దిలపాలెం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో అట్టడుగు వర్గాలకు సైతం నాణ్యమైన విద్య చేరువవుతుందని ఆంధ్రా యూనివర్సిటీ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) భువనేశ్వర్‌లో 'ఏఐ అండ్ అడాప్టివ్ లెర్నింగ్ ఇన్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్' అనే అంశంపై జరుగుతున్న సదస్సులో గురువారం జేమ్స్ స్టీఫెన్ రెండు ప్రత్యేక ప్రసంగాలిచ్చారు. డిజిటల్ సాంకేతికత ఫలితంగా బి.ఆర్.అంబేడ్కర్ ఆశించిన సామాజిక న్యాయం సాకారమవుతుందని పేర్కొన్నారు. విద్యా రంగంలోని సమస్యలకు పరిష్కారం చూపుతూ, సాంకేతికతను అనుసంధానం చేస్తూ సమానత్వాన్ని సాధించే విషయాలు, జరిగే ప్రయత్నాన్ని తెలియజేశారు. ప్రత్యేక అవసరాలు గల వారికి, అట్టడుగు వర్గాల వారికి విద్యను ఆధునిక సాంకేతిక విధానాలతో ఏ విధంగా చేరువ చేయవచ్చో వివరించారు. ఏఐ బోధనలో ఉపయోగించే విధానాలపై అధ్యాపకులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)లో భాగంగా ఐఐటీ భువనేశ్వర్‌లోని హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 27 వరకు ఉపన్యాసాలు జరుగుతాయని తెలిపారు. వివిధ విభాగాల అధ్యాపకులకు సమగ్ర విద్యా విధానాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సమన్వయం చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు.



సదస్సులో పాల్గొన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ బృందం

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ



కృష్ణా డిగ్రీ కళాశాలలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మద్దిలపాలెం: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, రెడ్ రిబ్బన్ క్లబ్, యూత్ రెడ్ క్రాస్, ఉన్నత భారత అభియాన్ వలంటీర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు మత్తు పదార్థాలపై అవగాహన ప్లకార్డులు ప్రదర్శించారు. డ్రగ్స్ సేవించడం వల్ల కలిగే అనర్థాలపై, వాటి నిర్మూలనపై అవగాహన కల్పించారు. సమాజాన్ని మత్తు పదార్థాల నుంచి కాపాడే బాధ్యత యువత తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ జోనల్ ఆఫీసర్ పోల ఉమామహేశ్వరరావు, అధికారులు జి.వి.ప్రతాప్, బి.నాగేశ్వరరావు, ఉన్నత భారత అభియాన్ కో ఆర్డినేటర్ ఎస్.వి.రామారావు, యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ సాయికృష్ణ, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లాయే లక్ష్యం

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెదవాల్తేరు పోలమాంబ ఆలయం నుంచి మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈఎన్‌టీ ఆస్పత్రి వరకు ర్యాలీ సాగింది. అనంతరం ప్రభుత్వ మానసిక ఆస్పత్రి మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడారు. విశాఖను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో యువత ముఖ్య పాత్ర పోషించాలన్నారు. మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయట పడడం కోసం మందులు ఏ విధంగా సహకరిస్తాయో తెలిపారు. అనంతరం ఎన్జీవో సిబ్బందికి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మత్తు మందుల వాడకం, అక్రమ రవాణాను వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రొంణంకి రమేష్, డాక్టర్ హరికృష్ణ, ప్రభుత్వ మానసిక వైద్యశాల ప్రొఫెసర్ డాక్టర్ హైమావతి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రవణ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, సమిత ప్రాజెక్టు డైరెక్టర్ డి.వీరభద్రరావు, జిల్లా సీపీఎం ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్ బద్రి, సమిద స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, వివిధ ఎన్జీవోలు, నర్సింగ్ స్టూడెంట్లు, కమ్యూనిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మెరైన్ పోర్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీడీవీ యాదవ్ అన్నారు. ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయన్నారు. డ్రగ్స్ అలవాటు బారి నుంచి స్నేహితులను, కుటుంబ సభ్యులను, కాలేజీ యువతను రక్షించడానికి సహకారం అందించాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడినా, అక్రమ రవాణా చేసినా, టోల్ ఫ్రీ నంబర్ 1972కు కాల్ చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పోర్టు మెరైన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు

ఆరిలోవ: ఈ ఏడాది జూలై 10 వరకు గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కరుణాకరరావు తెలిపారు. వర్షా కాలం కావడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గొర్రెలు, మేకలకు వ్యాధులు రాకుండా గురువారం నట్టల నివారణ మందులు వేసే కార్యక్రమం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల గొర్రెలకు టీకాలు వేసినట్లు జేడీ చెప్పారు. జిల్లాల్లో గొర్రెలు, మేకలు పెంచుతున్న రైతులు వాటికి నట్టల నివారణ మందులను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. వాటికి ప్రతి మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ టీకాలు వేయిస్తుండాలన్నారు. గొర్రెలు, మేకలు పచ్చిక మేసే సమయంలో పొట్టలో పురుగులు చేరుతాయని, వాటి వల్ల రక్తహీనత కలిగి నీరసిస్తాయని చెప్పారు. అలాంటి వ్యాధుల నుంచి రక్షణకు నట్టల నివారణ మందు వేస్తున్నామన్నారు. జిల్లాలో 42,000 గొర్రెలు, 26,000 మేకలున్నాయని వెల్లడించారు. వాటన్నింటికి సరిపడేలా మందులు సిద్ధం చేశామని, అన్ని పశువుల ఆస్పత్రుల్లో వీటిని అందుబాటులో ఉంచామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాజశేఖర్, ఏడీ డాక్టర్ ఎం.ప్రసాదరావు, వెటర్నరీ వైద్యురాలు సుజాత పాల్గొన్నారు.



గొర్రెకు నట్టల నివారణ మందు వేస్తున్న పశు సంవర్ధక శాఖ జేడీ కరుణాకరరావు

హిందుత్వమే దేశాభివృద్ధి, సమగ్రతకు మూలం



మాట్లాడుతున్న భరత్‌కుమార్ జీ

ఎంవీపీకాలనీ: హిందుత్వమే దేశాభివృద్ధికి, సమగ్రతకు మూలమని ఆర్ఎస్ఎస్ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ జీ అన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు పి.వి.చలపతిరావు జయంతి సందర్భంగా గురువారం ఎంవీపీ కాలనీ ఐఏఎం ఆడిటోరియంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సమగ్ర మానవతా వాదంపై స్మారక ఉపన్యాసం నిర్వహించారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా పాల్గొని చలపతిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ జీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక సమాజంతోనే దేశీయ, అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్ఫూర్తితో సమాజంలో అసమానతలు తొలగించడానికి దేశంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శ్రీనివాసవర్మ మాట్లాడుతూ బీజేపీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. నిస్వార్థ సేవకుడి గుర్తింపు పొందిన పి.వి. చలపతిరావు సమాజానికి, బీజేపీకి అందించిన సేవలను కొనియాడారు. త్వరలోనే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించనున్నట్లు శ్రీనివాసవర్మ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, పలువురు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీ రామలక్ష్మి తదితరులు

ఎంవీపీకాలనీ: అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం 'మాదక ద్రవ్యాల నిరోధం'పై పోస్టర్ ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీ సంక్షేమ భవన్‌లోని స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత శాఖ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆ శాఖ పీడీ కె.వి.రామలక్ష్మి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మాదక ద్రవ్యాల వల్ల యువత, సమాజం ఎదుర్కోవలసిన విపత్కర పరిస్థితులను వివరించారు. మాదక ద్రవ్యాలను అడ్డుకోవడంలో సమాజంలోని ప్రజా, యువత సంఘాలన్నీ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, ప్రజ్ఞాన్ కుమార్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల కమిటీలో సభ్యత్వానికి దరఖాస్తుల స్వీకరణ

మద్దిలపాలెం: వీధి విక్రయదారుల నగర కమిటీలో అనధికారుల సభ్యత్వం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జీవీఎంసీ జోన్-3 కమిషనర్ కె.శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీధి విక్రయదారుల చట్టం-2014 జీవో 137 ప్రకారం జీవీఎంసీలో వీధి విక్రయదారుల నగర కమిటీలో నలుగురు అనధికార సభ్యులను ఎంపిక చేస్తామన్నారు. వారిలో వివిధ వ్యాపార వృత్తికి చెందినవారు, నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్(ఎన్‌జీవో)-1, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్-1ను ఎంపిక/నామినేషన్ విధానం ద్వారా మూడేళ్ల కాలపరిమితి గల కమిటీని ఎన్నుకుంటామని పేర్కొన్నారు. దీనికి స్ట్రీట్ వెండర్ అసోసియేషన్, మార్కెట్ అండ్ ట్రేడ్ అసోసియేషన్, రిజిస్టర్ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్, కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ లైక్ టౌన్ లెవెల్ ఫెడరేషన్ లీడర్, నివాసిత సంక్షేమ సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఈ దరఖాస్తులను నోటిఫికేషన్ ఇచ్చిన 7 రోజుల్లో రిజిస్టర్ పోస్టు ద్వారా గాని, నేరుగా ఆశీలమెట్ట జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలోని యూసీడీ విభాగంలో గల డ్రాప్ట్ బాక్స్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో సాయంత్రం 5 గంటలలోగా అందజేయాలని సూచించారు. దరఖాస్తు నమూనా, ఇతర వివరాలను జోన్-3 కార్యాలయంలో పొందవచ్చన్నారు. వివరాలకు కార్యాలయంలో యూసీడీ ఏపీడీ ఎల్.రామును సంప్రదించాలని కోరారు.

రెండు రోజుల్లో కమిటీల ఏర్పాటు పూర్తవ్వాలి



వైఎస్సార్‌సీపీ తూర్పు శ్రేణులతో మాట్లాడుతున్న సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: తూర్పు నియోజకవర్గంలో వార్డు, బూత్, అనుబంధ సంఘాల కమిటీల ఏర్పాటును రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయ కర్త మొల్లి అప్పారావు ఆదేశించారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో గురువారం కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, వార్డు ఇన్‌చార్జులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అనుబంధ విభాగాలు, వార్డు కమిటీలు, వార్డు అనుబంధ విభాగాల కమిటీలు, బూత్ కమిటీల్లో సభ్యులను త్వరగా నియమించాలన్నారు. పార్టీ కోసం నిజాయితీగా కష్టపడుతున్న సీనియర్ కార్యకర్తలను మాత్రమే కమిటీల్లోకి తీసుకోవాలని సూచించారు. వార్డుల్లోని అన్ని కాలనీల నుంచి ఇటువంటి కార్యకర్తలను ఎంపిక చేసి వారిని కమిటీల్లో చేర్చాలన్నారు. ఈ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తిచేసి నియోజకవర్గ కార్యక్రమంలో అందజేయాలని కోరారు. రాష్ట్ర మత్స్య శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయ్ చందర్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షులు వాసుపల్లి యల్లాజీ, పీతల గోవింద్, పులగం కొండారెడ్డి, మధుపాడ రవి, బోండా శ్రీను, పతివాడ కనకరాజు, వెంకటలక్ష్మి, పులగం సూర్యనారాయణ రెడ్డి, ముగడ రమేష్, బోస రమణరెడ్డి, సత్యాల వెంకట్, కణితి మరియదాసు, చొల్లంగి నాగేశ్వరరావు, నీలారెడ్డి, ఉమ్మిడి కల్యాణ్, సురాడ దాసు, నగిరెడ్ల పోలిరెడ్డి, శరగడం వేణుగోపాలరెడ్డి, సంపంగి సురేష్, వాడమదుల గణేశ్, మారుపల్లి పరదేశి, మారిశెట్టి సంజీవ్, చిలపర్తి గోవింద్ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తిచేయండి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న ప్రాజెక్టులు సత్వరమే పూర్తి చేయాలని, నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ వద్దని ఇంజినీరింగ్ అధికారులను వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో గురువారం ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏకి చెందిన పార్కుల్లో వాకర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సెంట్రల్ పార్కు ఆవరణలో కొత్తగా చేపట్టే యాంటీ డ్రగ్ పార్కు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యతరగతి వర్గాలకు అనువుగా ఉండే ఎన్టీఆర్ లే అవుట్ స్థలాల కోసం విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. ప్రజలు అధికారం ఇచ్చి ఏడాది పూర్తయిందని, ప్రజలిచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంలో అలసత్వం వద్దన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్లు రామరాజు, సుధీర్, రాంబాబు, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

కేర్‌లో క్లిష్టమైన అనురిజం సర్జరీ

ఆరిలోవ: హెల్త్‌సిటీ కేర్ ఆస్పత్రిలో ఓ వ్యక్తికి క్లిష్టమైన అనురిజం శస్త్రచికిత్స చేసినట్లు వైద్యులు తెలిపారు. కేర్‌లో గురువారం రోగితోపాటు వైద్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రేవంత్ మారంరెడ్డి మాట్లాడుతూ పొన్నాడ నల్లింశెట్టి అనే వ్యక్తి ఏడాది నుంచి ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది, కడుపునొప్పి, దగ్గుతో రక్తం కారడం సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ఆయన ఇటీవల కేర్‌లో సంప్రదించడంతో అవసరమైన పరీక్షలు చేసినట్లు చెప్పారు. వాటిలో గుండెకు రక్తనాళంలో బెలూన్ లాంటి వాపు ఉన్నట్లు గుర్తించి అనురిజం వ్యాధిగా నిర్ధారించామన్నారు. ఊపిరితిత్తుల స్కాన్‌ల్లో ఇన్ఫెక్షన్, గుబురు లాంటి ఖాళీలు కనిపించడం, బ్రోంకోస్కోపీ ద్వారా వాయు మార్గాల్లో మలినాలు, రక్తం గడ్డ కట్టినట్లు గుర్తించామని తెలిపారు. ఆ వ్యక్తిలో ఇది చాలా క్లిష్టమైన పరిస్థితి కావడంతో కార్డియోపల్మనరీ బైపాస్ సహాయంతో అనురిజం సర్జరీ చేశామన్నారు. ఇది విజయవంతం కావడంతో ఆరోగ్యంగా ఉన్నాడన్నారు. అతడిని గురువారం డిశ్చార్జి చేసినట్లు చెప్పారు. సమావేశంలో కేర్ సీవోవో మయూక్ చౌదరి, వైద్యులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కేర్ వైద్యులు

పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించకుంటే ఆందోళన



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు

మహారాణిపేట: ఉద్యోగులకు, పెన్షనర్ల డిమాండ్లు, ఇతర సమస్యలను తక్షణం పరిష్కరించాలని లేకుంటే ఆందోళనకు దిగనున్నట్లు జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు డీడీ ప్రసాదరావు అన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు విషయాలపై కూలంకషంగా చర్చించినట్లు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19, 20 తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ సర్వసభ్య సమావేశం చర్చించిన అంశాలను వివరించారు. పెండింగ్ డిమాండ్లు, డీఏ బకాయిలు, కొత్త పీఆర్సీ అమలు, మధ్యంతర భృతి, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ శాతం పెంపు తదితర డిమాండ్లపై చర్చించామన్నారు. డిమాండ్లను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళన చేసేందుకు్కూడా వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, జిల్లా ట్రెజరీ అధికారి జె.సత్యారావు, సంఘం కోశాధికారి టి.గోపాలకృష్ణ, అగర్వాల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జేమ్స్ ఎస్కే ఆడమ్స్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.